యువత క్రీడల్లో సత్తా చాటాలి

• **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి**

విజేతలకు బహుమతులు అందిస్తున్న పాల్వాయి స్రవంతి

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 27 : యువత క్రీడల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి అన్నారు. మండలంలోని జనగాం గ్రామంలో నిర్వహిస్తున్న మండలస్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ప్రథమ బహుమతి సర్వేల్, ద్వితీయ జనగాం, తృతీయ బహుమతి వెంకాంబావితండా జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గడ్డం రాములమ్మ, ఉప సర్పంచ్ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలేశ్, నాయకులు గడ్డం మురళీధర్‌రెడ్డి, గడ్డం నరేశ్, ముత్యాలు, పాపయ్య, బుచ్చయ్య, అంజయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మోత్కూరు, జనవరి 27 : మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తరగతి గదుల్లో ఉన్న ఆరు సీలింగ్ ఫ్యాన్లు, రెండ్ ఎల్ఈడీ లైట్లు దొంగిలించారు. శనివారం ఉదయం అటెండర్ పాఠశాలకు వచ్చి చూసేసరికి తరగతి గది తాళం పగులకొట్టి ఉండడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సుమారు రూ.20వేల విలువైన సామగ్రి చోరీ జరిగినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపాడు.

కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

కోదాడ, జనవరి 27 : కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్ చైర్‌పర్సన్ వెంపటి పద్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రిటర్నింగ్ అధికారి సూర్యానారాయణ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా ఒకరు మృతిచెందారు. 34 మంది కౌన్సిలర్లకు గానూ 33 మంది హాజరయ్యారు. తీర్మానానికి 29 మంది కౌన్సిలర్లు మద్దతు తెలుపగా, నలుగురు వ్యతిరేకంగా తమ నిర్ణయాన్ని వ్యక్తపరిచారు. దాంతో అవిశ్వాసం నెగ్గినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించి ఆదేశాల మేరకు నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపడుతామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌నాయక్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శిరీష

కాంగ్రెస్ నాయకుల కపట ప్రేమ బహిర్గతం

• **మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శిరీష**

కోదాడ : గతంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన చైర్‌పర్సన్‌కు అవమానం జరిగిందని ప్రేమ ఒలకబోసిన కాంగ్రెస్ నాయకులు తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం వారి కపట ప్రేమను తెలియజేస్తుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష అన్నారు. అవిశ్వాస తీర్మానం అనంతరం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా కోదాడ పట్టణాన్ని మాజీ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పక్షపాతం లేకుండా కాంగ్రెస్ కౌన్సిలర్లకు అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిచ్చినట్లు చెప్పారు. అంతా మరిచి తనపై అవిశ్వాసం ప్రవేశపెట్టడం శోచనీయమన్నారు. తనకు సహకరించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంపటి పద్మావతీమధుబాబు, వనపర్తి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు షఫీ, బెజవాడ శిరీశా శ్రవణ్ పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే అభివృద్ధి

• **ఎంపీపీ జ్యోతీమధుబాబు**

మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతీమధుబాబు

నడిగూడెం, జనవరి 27 : ముందస్తు ప్రణాళికతోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా పనుల అంచనా వ్యయాన్ని, దానికి సంబంధించి పని ప్రదేశాలను గుర్తించడం, సలహాలు, సూచనలు అధికారుల నుంచి తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీఎఫ్ఓ సతీశ్, తాసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ ఇమామ్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు పల్లా నర్సిరెడ్డి, గోలి సునీతావెంకటేశ్వర్లు, గార్లపాటి మాలతీశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

అనంతగిరి, జనవరి 27 : మధ్యాహ్న భోజనం వికటించి పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన కొద్దిసేపటికే వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఓ విద్యార్థి స్పృహ తప్పిపోవడంతో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను నిలదీశారు. తాసీల్దార్ రవికుమార్, ఎంఈఓ సలీం షరీఫ్ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం

సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

హుజూర్‌నగర్, జనవరి 27 : హుజూర్‌నగర్‌లోని గాంధీ పార్క్ వద్ద శనివారం రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్య హరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల ఉపాధ్యక్షుడు గుంటి పిచ్చయ్య, జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీను, కళాకారులు దొంతగాని సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ముస్తాఫా, ధర్మయ్య, హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రజ్ఞా విద్యార్థుల ప్రతిభ

మునగాల, జనవరి 27 : మునగాల గ్రంథాలయంలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆరు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ప్రజ్ఞా హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు గ్రంథాలయ అధికారి దేవబత్తిని లలితాదేవి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లేపల్లి మహేశ్, గోపాల్‌రెడ్డి, గండు సతీశ్, చైతన్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

మామిళ్లగూడెంలో విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

మోతె, జనవరి 27 : నేషనల్ హైవే నిధులతో మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శనివారం ప్రారంభించారు. రోడ్డు వెడల్పులో భాగంగా విద్యుత్ ఉప కేంద్రాన్ని తొలగించగా, నేషనల్ హైవే నిధులు రూ.50 లక్షలతో విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప కేంద్రం కింద ఉన్న గ్రామాల్లో విద్యుత్ సమస్య తీరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆశా, జడ్పీటీసీ పుల్లారావు, ఎస్ఈ పాల్‌రాజ్, డీఈ వెంకటప్పయ్య, ఏఈ శాంతి, సర్పంచ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

మోతె : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి

చిలుకూరు : మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని మిట్స్ కళాశాల ఆవరణలో గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ షకీనా, ప్రిన్సిపాల్ గజ్జెల అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపే లక్ష్యం

• ఎంపీపీ రాణి

కోదాడ రూరల్, జనవరి 27 : విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఎంపీపీ మల్లెల రాణి, ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. శనివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రథమ స్థానం కోదాడ ఉన్నత పాఠశాల, ద్వితీయ పాలవరం, తృతీయ బహుమతి శాంతినగర్, సింగారం పాఠశాలలు దక్కించుకున్నట్లు తెలిపారు.

చిలుకూరు : టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఎంపీపీ బండ్ల ప్రశాంతి అన్నారు. చిలుకూరులో జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు ఆమె బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తుంగతుర్తి : జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎడ్ల గోపయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు ఇంగ్లిష్ మీడియం విభాగంలో టీఎస్ఆర్ఎస్ బాలుర గురుకుల పాఠశాల, తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్ అన్నారం. ప్రైవేట్ పాఠశాలల్లో మేరి మదర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మండల స్థాయిలో ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. విజేతలకు ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్ బహుమతులు ప్రదానం చేశారు.

నేరేడుచర్ల : నేరేడుచర్ల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు క్రాంతినికేతన్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్, హెచ్ఎం బట్టు మధు, సభ్యులు చిత్రం విశ్వనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషన్ డే

బొడ్రాయిబజార్ : థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎలక్ట్రీషియన్లు

బొడ్రాయిబజార్, జనవరి 27 : బల్బును కనిపెట్టిన థామస్ అల్వా ఎడిసన్ ఎంతోమంది ఎలక్ట్రీషియన్ల జీవితాల్లో వెలుగులు నింపి బతుకునిచ్చారని ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ ప్రొడక్షన్ ఎండీ మీలా మహదేవ్ అన్నారు. తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎలక్ట్రీషియన్ డేలో ఆయన మాట్లాడారు. టీపీఈటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాపర్ అసోసియేషన్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మంజుల, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలో యూనియన్ జెండాను ఎగురవేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేం ద్రం లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఎలక్ట్రీషియన్లకు లేబర్ కార్డులు అందజేశారు. మండల ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ యూనియన్ అధ్యక్షుడు కటకం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్ట్

మోతె, జనవరి 27 : వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లను దొంగతనం చేసిన వ్యక్తులను శనివారం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారిగూడెం గ్రామానికి చెందిన మండవ సాయి, రెడ్డిమళ్ల లోకేశ్, నాయిని వినయ్, నర్సింహాపురం గ్రామానికి చెందిన వలిశెట్టి శ్రీను నలుగురు కలిసి రంగాపురంతండా శివారులో వాగు వెంబడి పాలేరు వాగు బండ్ల దారిలో శుక్రవారం రాత్రి వ్యవసాయ విద్యుత్ మోటార్లను దొంగతనం చేసినట్లు తెలిపారు. వాటిని తీసుకుని ఆటోలో వెళ్తుండగా సమాచారం మేరకు రైడ్ చేసి మామిళ్లగూ డెం టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నట్లు చెప్పా రు. ఆటోను, మోటార్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్, జనవరి 27 : రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేడు నియోజకవర్గంలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, గరిడేపల్లి మండలాల్లో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పర్యటన సందర్భంగా మంత్రి నూతన పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని పేర్కొంది.

30న సూర్యాపేటలో ఉద్యోగ మేళా

సూర్యాపేట అర్బన్, జనవరి 27 : హెచ్‌సీఎస్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న టెక్ బి ప్రొగ్రాం కోసం 2023-24లో ఎంపీసీ, ఎంఈసీలో ఇంటర్ పూర్తి చేసుకున్న, చేసుకోబొతున్న విద్యార్థులకు ఈ నెల 30న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాకు హాజరయ్యేవారు పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, ఆధార్, ఫొటో, ఆండ్రాయిడ్ మెబైల్‌తో హాజరు కావాలని, పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ మేనేజర్ రమేశ్ సెల్ 8341405102 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పెదవీడు సర్పంచ్‌పై అధికారులకు ఫిర్యాదు

మఠంపల్లి, జనవరి 27 : మండలంలోని పెదవీడు సర్పంచ్‌పై గ్రామస్తులు పలువురు శనివారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ సయ్యద్ బీబీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ నిధుల దుర్వినియోగం, అవినీతికి పాల్పడినట్లు ఆరోపిస్తు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి డీపీఓ యాదయ్యకు వార్డు సభ్యులు మొగిలి మట్టయ్య, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

నేడు గరిడేపల్లిలో డయాబెటిక్ క్యాంప్

గరిడేపల్లి, జనవరి 27 : లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిలకర రామస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి వైద్య పరీక్షల నిర్వహణ జరుగనున్నట్లు వెల్లడించారు. క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాస్థాయి గణిత ప్రతిభ పరీక్ష

సూర్యాపేట అర్బన్, జనవరి 27 : తెలంగాణ గణిత ఫోరం సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. పరీక్షలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు, మెమొంటోలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎంఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శిగా డి.కోటేశ్వర్‌రావు, కోశాధికారిగా ఎం.శ్యామ్, ఉపాధ్యక్షులుగా శైలజ, జి.కాల్‌రామ్, పురుషోత్తం, సలహాదారులుగా జితేందర్‌రెడ్డి, మోతీలాల్ నాయక్, రాష్ట్ర కౌన్సిలర్‌గా అయోధ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎం.వెంకన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, డీసీఈబీ కార్యదర్శి కళారాణి, హెచ్ఎం గోలి పద్మ, టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ జి.వెంకటేశ్వర్లు, టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకన్న, ప్రధాన కార్యదర్శి డి.కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మ్యాథ్స్ జిల్లా ఫస్ట్ కోదాడ విద్యార్థి

కోదాడ రూరల్ : తెలంగాణ గణిత ఫోరం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో కోదాడ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి యోపిత్‌నాయుడు ప్రథమ స్థానం సాధించిన్నట్లు ఎంఈఓ సలీం షరీఫ్ తెలిపారు. విజేతకు జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి(డీసీఈఓ) కళావతి బహుమతి అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు పాండురంగాచారి, బోసు, వేణుకుమార్ విద్యార్థికి అభినందనలు తెలిపారు.

విద్యార్థి యోపిత్‌నాయుడుకు బహుమతి అందిస్తున్న డీసీఈఓ కళావతి

ఆర్థిక సాయం

అడ్డగూడూరు, జనవరి 27 : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కన్నెబోయిన లింగయ్య, కప్పల చామంతి ఇటీవల మృతి చెందగా.. ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగయ్య కుటుంబానికి రూ.25వేలు, చామంతి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శీలం దావిద్, లక్ష్మణాచారి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోరి నీర్నెంముల గ్రామానికి చెందిన ఆవుల లింగయ్య అనారోగ్యంతో మృతి చెందగా.. ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప శనివారం లింగయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట కొత్తగూడెం సర్పంచ్ చిల్లర కైలాసం, నోముల ప్రవీణ్, గంగుల వెంకట్‌రెడ్డి, సుర్వి సతీశ్ ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి ప్రభాజస్టిస్.

మోత్కూరు, జనవరి 27 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి ప్రభాజస్టీస్ అన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి జరిగే ప్రాక్టికల్స్, 28 నుంచి జరిగే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), ఖప్రాయపల్లి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, అరవిందరాయుడు, వెంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు ఎంపీ స్థానాలు కాంగ్రెస్‌వే..

• తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జనవరి 27 : పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మోత్కూరు ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బూత్‌స్థాయి నుంచి బలంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. అనంతరం చౌదరి బ్రదర్స్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను అవిష్కరించారు. అంతకుముందు కొండగడపలో మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రవెల్లి యాదమ్మ కుమారుడు పరుశురాం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు సత్యనారాయణ, చంద్రయ్య, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ మధు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

• **డీఈఓ అశోక్**

విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేట అర్బన్, జనవరి 27 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఈఓ అశోక్ అన్నారు. శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బాల భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో ఆయన మాట్లాడారు. నో బ్యాగ్ డేను ప్రతి పాఠశాలలో పాటించాలని, ప్రతి శనివారం విద్యార్థులకు డ్రాయింగ్, సంగీతం, కుట్లు అల్లికలు, ఆటల పోటీల్లో పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అంతకు ముందు బాల భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోలి పద్మ, హమీద్ ఖాన్, బాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి, ఎల్లయ్య, సత్యనారాయణ, ఉమా, అనిల్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ పరేడ్‌లో గరిడేపల్లి డప్పు కళాకారుల ప్రదర్శన

గరిడేపల్లి : డప్పు ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

గరిడేపల్లి, జనవరి 27 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన వేడుకల పరేడ్‌లో మండలానికి చెందిన డప్పు కళాకారులు కళా ప్రదర్శన చేసినట్లు బృందం నాయకుడు అమరవరపు సతీశ్ శనివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున భాషా సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు మామిడి హరికృష్ణ, సంగీత నాటక అకాడమీ, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సహకారంతో నారీశక్తిలో మహిళలే డప్పులు కొట్టారన్నారు. కళాబృందంలో అప్పన్నపేటకు చెందిన కల్పన, నాగమణి, సంధ్య, అనూరాధ, భువనేశ్వరి, రోష్ణవి, పరెడ్డిగూడేనికి చెందిన మార్త, అనిత, కల్మల్‌చెర్వుకు చెందిన లావణ్య, ధనమ్మ, పొనుగోడుకు చెందిన రజిత, నవ్య ఉన్నట్లు తెలిపారు.

సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శన

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శన

కోదాడ టౌన్, జనవరి 27 : రాజ్య శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2023-24 సూర్యాపేట జిల్లా సైన్స్ ఫెయిర్‌లో తెలంగాణ రాష్ట్ర సాంకేతిక మండలి హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో స్థానిక తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థి జి.సాయిఅభిరామ్ ప్రయోగం హైడ్రోలిక్ మిషన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జానకిరామయ్య, ప్రిన్సిపాల్ అప్పారావు, కార్యదర్శి సంతోశ్‌కుమార్ తెలిపారు. భూకంపాలు, భూ కుంగుబాటు, బ్రిడ్జిలు కుంగకుండా రక్షించేందుకు ఈ మిషన్ పరిజ్ఞానం ఉపయోగపడనున్నట్లు వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల కృషి అభినందనీయం

• **ఎంపీపీ పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

మోటకొండూర్, జనవరి 27 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల కృషి అభినందనీయమని ఎంపీపీ పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మోటకొండూర్ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత, వైస్ ఎంపీపీ ఇల్లెందుల మల్లేశ్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు బురాన్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మంత్రి రాజు, ఎంపీఓ కిషన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మోత్కూరు, జనవరి 27 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండగడపకు చెందిన నాలుగో వార్డు కౌన్సిలర్ ఎర్రవెల్లి యాదమ్మ- యాదయ్య కుమారుడు పరశురాములు(32) శుక్రవారం రాత్రి తన స్నేహితుడు ఎర్రవెల్లి నరేశ్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. రాజన్నగూడెం వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. నరేశ్ తీవ్రగాయాలు కావడంతో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రామన్నపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పట్టణానికి చెందిన మేకల మోహన్ (49) చిట్యాల మండలం వెలిమినేడులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 25న రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా రామన్నపేట రైల్వే ట్రాక్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.